క్లుప్తంగా

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేశ్

ఆసిఫాబాద్‌రూరల్: బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని పీటీజీ పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని రౌట సంకెపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి పాఠశాలలో చదువుతూ సంక్రాంతి సెలవుల తర్వాత నుంచి బడికి రాకపోవడంతో విద్యార్థి ఇంటికి వెళ్లారు. తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థిని పాఠశాలకు తీసుకొచ్చారు. ఉపాధ్యాయులు ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న ఏకాంబరం

జైనూర్: గురుకుల పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని గురుకులం అడ్మిన్ స్పెషల్ అధికారి ఏకాంబరం అన్నారు. ఆదివారం మండలంలోని భూసిమెట్ట గురుకుల పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భోజనం అందించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కల్యాణి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలోని వార్ధా నది ఒడ్డున గల శ్రీ శివ సిద్ధి హనుమాన్ ఆలయం ఆవరణలోని శ్రీ విఠల్ రుక్మిణి దేవి ఆలయంలోని ప్రథమ వార్షికోత్సవం వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో వేద పండితులు గోవింద్‌రావు, నారాయణ్ పటేల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. నవగ్రహ పూజలు చేసి హోమం నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు, కమిటీ సభ్యులు ప్రవీణ్, వాసు పటేల్, మనిరాం, బిక్కజీ, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్ రద్దు చేయాలి

ఆసిఫాబాద్: సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమికోన్నత పాఠశాల నుంచి సిర్పూర్ (టి) మండలంలోని లక్ష్మీపూర్ ప్రభుత్వ పాఠశాలకు అక్రమంగా ఇచ్చిన డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు మేడి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి పురుషోత్తంలు డిమాండ్ చేశారు. అధికారులు నిబంధనలకు విరుద్ధంగా స్థానికంగా ఉన్న పాఠశాలలోని ఉపాధ్యాయుడిని లక్ష్మీపూర్ గ్రామానికి డిప్యూటేషన్‌పై పంపించారని, ఉన్నతాధికారులు స్పందించి డిప్యూటేషన్ రద్దు చేయాలని వారు ఒక ప్రకటనలో కోరారు. డీఈవో దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు.

'చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లోబడె లహు కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం చలో ఢిల్లీ కరపత్రాలు విడుదల చేశారు. ఈ నెల 8న పార్లమెంట్ ముట్టడి, 9వ తేదీన జంతర్ మంతర్ వేదికగా జాతీయస్థాయి ఓబీసీల సదస్సు నిర్వహించనున్నట్లు లహుకుమార్ తెలిపారు. హక్కుల సాధనలో బీసీలు ఐకమత్యంతో ముందుకు సాగాలని, చలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున బీసీలు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘ సభ్యులు గంగాధర్, బబ్లూ, రాఘవ, మోహన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

లింగాపూర్: మండలంలోని రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈ నెల చివరిలోగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వసతులు లేక సతమతం

- రాంజీగూడ విద్యార్థుల అవస్థలు
- సరిపోని తరగతి గదులు
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు


తరగతి గదుల్లోనే విద్యార్థుల పెట్టెలు


రాంజీగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాల

కెరమెరి: వసతిగృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కన్పించడం లేదు. మండలంలోని రాంజీగూడ గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల ఏళ్లుగా పాత భవనంలోనే అరకొర వసతుల మధ్య కొనసాగుతోంది. విద్యార్థులకు సరిపడా గదులు కూడా లేకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 102 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా ముగ్గురు రెగ్యులర్ ఉపాధ్యాయులు, ఎనిమిది మంది సీఆర్‌టీలు విధులు నిర్వహిస్తున్నారు.

ఏళ్లుగా సమస్యలు..

విద్యాబోధనకు సరిపడా టీచింగ్ స్టాఫ్ ఉన్నప్పటికీ చదువుకునేందుకు గదులు లేక ఇక్కట్లు తప్పడం లేదు. ఏడు తరగతులకు నాలుగే గదులు ఉండడంతో కొన్ని తరగతుల విద్యార్థులను వరండాల్లో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. హాస్టల్‌కు, తరగతుల బోధనకు వేర్వేరు గదులు ఉండాలి. కానీ సరిపడా గదులు లేకపోవడంతో రెండింటిని ఒకే చోట నిర్వహిస్తున్నారు. చదువులతో పాటు విద్యార్థుల పెట్టెలు, బిస్తర్లు ఒకే చోట ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులు ఉండే గదుల్లోనే బస చేస్తున్నారు. కంప్యూటర్లు, ఏఎన్ఎం చెకింగ్, ప్రొజెక్టర్లతో పాటు స్టాఫ్, హెడ్ మాస్టర్ కూడా ఒకే గదిలో ఉండడం గమనార్హం. ఉన్న గదులకు సైతం తలుపులు సరిగా లేవు. కిటికీలకు రెక్కలు, కూడా లేకపోవడంతో విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అయినా అధికారులు కొత్త గదుల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

పని చేయని ఆర్వోప్లాంట్

వసతిగృహంలో గత కొద్ది సంవత్సరాలుగా ఆర్వో ప్లాంట్ పని చేయకపోవడంతో విద్యార్థులు చేతిపంపు నీటినే తాగుతున్నారు. 102 మంది విద్యార్థులకు రెండే మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉన్నాయి. ఐదేళ్ల క్రితం ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్మించిన రెండు మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. రాంజీగూడ గ్రామం కుమురం భీం ప్రాజెక్టులో ముంపు గ్రామం కావడంతో అక్కడి గ్రామస్తులకు ధనోరా వద్ద నూతన పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. కానీ అక్కడ కూడా పాఠశాల భవనం నిర్మించలేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బహిరంగ సభ విజయవంతం చేయండి

చింతలమానెపల్లి: కాగజ్‌నగర్‌లో ఈనెల 11న జరగనున్న సీఐటీయూ బహిరంగ సభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని బాలాజీఅనుకోడ రైతు వేదికలో సీఐటీయూ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె నేపథ్యంలో 11వ తేదీన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ, వ్యవసాయ, అఖిల భారత ఫెడరేషన్లు, సంఘాలు నిర్ణయించిన మేరకు కార్మిక, కర్షక వర్గాలు సమ్మెలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ విలాస్, నాయకులు నగేష్, రవి, అంగన్వాడీ నాయకులు కళావతి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు పద్మ, వనిత, విమల తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అండగా నిలవాలి

మంచిర్యాలటౌన్: తెలంగాణ ఉద్యమకారులకు అండగా నిలవాలని కోరుతూ పలువురు ఉద్యమకారులు ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌లను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో 100రోజుల్లోపు తెలంగాణ ఉద్యమకారులకు 250గజాల స్థలాన్ని ఇస్తామని చెప్పారని, ఆ హామీని నెరవేర్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ గుండేటి ఐలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడ నారాయణ రెడ్డి, నగమల్ల ప్రకాశ్, సత్యనారాయణ, రాజన్న, లింగమూర్తి, సుధాకర్, శంకర్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్

రెబ్బెన: బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో రెబ్బెన మండలంలోని గంగాపూర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. పలువురు పతకాలు సాధించినట్లు మాస్టర్ కుమార్ వెల్లడించారు. పాఠశాలకు చెందిన రాంచరణ్ బంగారు పతకం సాధించగా, ఎల్.కిరణ్మయి, ఎస్.సంజయ్, జె.సాయిమోక్ష వెండి పతకాలు, వి.అఖిల్ కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

క్రీడాస్ఫూర్తిని చాటడం అభినందనీయం

నేరడిగొండ: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటడం అభినందనీయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని చిన్నబుగ్గారం గ్రామంలో గతనెల రోజులుగా జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేత జట్లకు ట్రోఫీతోపాటు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతోపాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎంపీపీ రాథోడ్ సజన్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు పాల్గొన్నారు.

ట్రస్ట్ ఆధ్వర్యంలో మాతాశిశు ఆసుపత్రి నిర్మించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు సమీపంలోని ముద్దనహళ్లిలో గల సత్యసాయి గ్రామంలో సద్గురు శ్రీ మధుసూదన సాయిని ఎమ్మెల్యే డాక్టర్ హరీశ్‌బాబు కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. మారుమూల ప్రాంతమైన సిర్పూర్ కాగజ్‌నగర్‌లో మాతా శిశు ఆసుపత్రి నిర్మించాలని కోరారు.

మోదీకి మెదక్ పార్లమెంట్ సీటును బహుమానంగా ఇవ్వాలి

కాగజ్‌నగర్‌రూరల్: కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మెదక్ పార్లమెంట్ సీటును బహుమానంగా ఇవ్వాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా మనోహరాబాదులో ఆదివారం పార్లమెంటరీ స్థాయి కార్యకర్తలు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు, జిల్లాల అధ్యక్షులు మోహన్ రెడ్డి, గడ్డం శ్రీనివాస్, గోదావరి అంజిరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్లు, కోకన్వీనర్లు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సైకాలజిస్టు సుధీర్ సంధ్ర

కాగజ్‌నగర్‌రూరల్: సోషల్‌మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలని ప్రముఖ సైకాలజిస్టు, కెరియర్ కౌన్సిలర్, మోటివేషనల్ స్పీకర్ సుధీర్ సంధ్ర అన్నారు. ఆదివారం పట్టణంలోని పద్మశాలి భవనంలో కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులకు మోటివేషనల్ స్పీచ్ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు సురవర్ధన్, ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరాఠా మహా సంఘ్ జిల్లా కమిటీ

ఆసిఫాబాద్‌రూరల్: భారతీయ మరాఠా మహా సంఘ్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర యువ అధ్యక్షుడు బాజీరావు తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశంలో కుమురం భీం జిల్లా అధ్యక్షుడిగా అల్గం తుల సీరాం, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా విలాస్, దీపక్ పటేల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహా సంఘ్ నాయకులు శ్రీనివాస్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో మద్యం పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు మండల కేంద్రానికి చెందిన డోంగ్రి నానయ్య అనే వ్యక్తికి చెందిన కిరాణా దుకాణంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో రూ. 4వేల విలువ చేసే 10లీటర్ల నాటుసారా, రూ. 7150 విలువ చేసే 35 దేశీదారు సీసాలు లభ్యమయ్యాయి. మద్యం స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డోంగ్రి నానయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెక్కు అందజేత

భీమారం: భీమారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బానోత్ రఘుపతి మృతి చెందగా, అతడికి పార్టీ నుంచి మంజూరైన రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఆదివారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ తన పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తుందన్నారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షులు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నాయకులు బుక్యా రాజ్‌కుమార్ నాయక్, జలంపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కనక దుర్గాదేవి ఆలయంలో భక్తుల సందడి


తలనీలాలు ఇస్తున్న భక్తులు


అన్నదానం చేస్తున్న దేవార వినోద్

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవీ, మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పక్క మండలాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి పూజలో భాగంగా ఓడి బియ్యం, పట్టువస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కులో భాగంగా పలువురు భక్తులు తమ పిల్లల తలనీలాలు అమ్మవారికి సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రేపు ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయ జాతర వేలం

కాగజ్‌నగర్‌రూరల్: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయ జాతర నిర్వహణకు సంబంధించిన వేలం ఈనెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి వేణుగోపాల్ గుప్తా తెలిపారు. మార్చి 7, 8, 9 తేదీల్లో జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొబ్బరికాయలు, ప్రసాద విక్రయం, తైబజార్ నిర్వహణ, పాలు, పత్రి విక్రయం, కొబ్బరికాయ ముక్కలు పోగుచేసుకోవడం, వాహనాల పార్క్ నిర్వహణకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ. 50 వేల డిపాజిట్ చెల్లించి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు పాసుబుక్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తిక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఇష్టారీతిగా బీడీపీపీ ప్రభుత్వ భూములను కబ్జాదారులు చదును చేసుకున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను కబ్జాదారులు అక్రమ వెంచర్లు వేసుకుంటున్నా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి ప్రభుత్వ భూములను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు టికానంద్, జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

పాతమంచిర్యాల: శాలీవాహన పవర్ ప్లాంట్ కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన నిరాహార దీక్ష ఆదివారం ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ మాట్లాడుతూ.. 14నెలల క్రితం పవర్‌ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిపివేసి, ప్లాంట్ మూతవేసిన యాజమాన్యం తమకు రావాల్సిన వేతనాలు, ఇతర బకాయిలు చెల్లించడంలో కాలయాపన చేస్తుందన్నారు. యాజమాన్యం స్పందించి తమకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

జైనథ్: మండల కేంద్రానికి చెందిన బోరి పవన్ ఇటీవల బ్రెయిన్ ట్యూమర్‌కు గురై చికిత్స పొందాడు. మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందించారు. మాల సామాజికవర్గానికి చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు సాయంగా రూ.31 వేల అందజేశారు. నాయకులు అల్లూరి భూమన్న, హర్ష, దేవిదాస్, యాసంత, నారాయణ, ప్రభుదాసు, శశికాంత్, కుమ్మరి, సత్యనారాయణ, బ్రహ్మ శ్రీనివాస్, ప్రభాకర్, క్రాంతి, హర్ష, రమేశ్ పాల్గొన్నారు.

గంగ స్నానానికి చిలకలయ్య దేవుడు


గంగ స్నానానికి తీసుకెళ్తున్న భక్తులు

దహెగాం: బోనాల సందర్భంగా మండలంలోని చిన్న ఐనం గ్రామంలో చిలకలయ్య దేవుడిని భక్తులు ఆదివారం గంగ స్నానానికి తీసుకెళ్లారు. గంగ స్నానం అనంతరం సోమవారం ఆలయం వద్ద బోనాల పండుగ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే చిలకయ్య దేవుని వద్ద ప్రతీ సంవత్సరం బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు.

సదల్‌పూర్ జాతరకు బారులు

బేల: మండలంలోని సదల్‌పూర్ శివారులోని బైరం దేవ్, మహాదేవ్ ఆలయాల పరిసరాల్లో కొనసాగుతున్న జంగీ జాతరలో రెండోరోజు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. రంగుల రాట్నాలు, ఇతరత్రవి చిన్నారులు, యువత ఆటపాటలు కేరింతలతో సందడిగా మారాయి. యువతులు, మహిళలతో దుకాణాల్లో కిక్కిరిశాయి. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వంటావార్పు చేసుకున్నారు.

అత్యవసర సేవలకు తిప్పలు


పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- ఆసుపత్రులకు తరలించేందుకు ఇబ్బందులు
- ప్రైవేటు వాహనాలే దిక్కు

పెంచికల్‌పేట్: మండలంలో 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో లేక రోగులు అత్యవసర సమయాల్లో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్సు లేక ప్రైవేటు వాహనాల్లో ఉన్నత వైద్యం కోసం పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. నూతనంగా ఏర్పడిన మండల కేంద్రంలో అత్యవసర సమయంలో రోగులను తరలించడానికి 108 అంబులెన్సు ఏర్పాటు చేయాలని మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

మండలంలో..

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలు కమ్మర్‌గాం, గుండెపల్లి, నందిగామ, మురళీగూడ, జిల్లెడ, అగర్‌గూడ, జైహింద్‌పూర్, ఎర్రగుట్ట, కొండపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు అత్యవసర సమయంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం అత్యవసర సమయంలో పెంచికల్‌పేట్, బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేరుకోవటానికి సుమారు 12 నుంచి 20 కిలోమీటర్ల దూరం ప్రైవేటు వాహనాల్లో ప్రయాణిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాగజ్‌నగర్ పట్టణానికి ప్రైవేటు వాహనాల్లోనే వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

బెజ్జూర్ వాహనమే దిక్కు..

పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్ మండలాలకు బెజ్జూర్‌లోని 108 అంబులెన్స్ అత్యవసర సేవలను అందిస్తుంది. బెజ్జూర్ వాహనం సరైన సమయంలో అందుబాటులో లేకుంటే రోగులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది. దీంతో సరైన సమయంలో వైద్యం అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మండల కేంద్రంలో 108 అంబులెన్సు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

108 మంజూరు చేయాలి



మండలానికి 108 అంబులెన్స్ మంజూరు చేయాలి. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం కాగజ్‌నగర్ తరలించడానికి ఇబ్బందులు పడుతున్నాం. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడం భారంగా మారుతోంది. అధికారులు స్పందించాలి.

– రౌతు ప్రకాశ్, కొండపల్లి